మహిళాభివృద్ధిలో మరో ముందడుగు

- అడ్డురోడ్డులో మహిళా మార్టు ఏర్పాటు
- 1815 స్వయం సహాయక సంఘాల సహకారం
- నేడు ప్రారంభోత్సవం
- రాయితీతో నాణ్యమైన సరకులు విక్రయం


అడ్డురోడ్డులో ప్రారంభానికి ముస్తాబైన మహిళామార్టు


మహిళా మార్టులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన సరుకులు

ఎస్.రాయవరం : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు ఈ నెల 29 తేదీ గురువారం అందుబాటులోనికి రానుంది. పాయకరావుపేట నియోజకవర్గంలో అడ్డురోడ్డు కేంద్రంగా ఈ మార్టు ప్రారంభిస్తున్నట్టు వెలుగు అధికారులు చెబుతున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోనికి వచ్చిన తరువాత రెండేళ్లుగా రాష్ట్రంలో మహిళా మార్టులు ఏర్పాటవుతున్నాయి. వీటి ద్వారా నాణ్యమయిన సరుకులు రాయితీ ధరల్లో విక్రయించడం జరుగుతోందని చెబుతున్నారు. ఎస్.రాయవరం మండల మహిళా సమాఖ్య నుంచి మండలంలో 1815 స్వయం సహాయక సంఘాల్లో 18,750 మంది సభ్యుల షేరు ధనంతో ఈ మార్టు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఒక్కో సభ్యురాలు నుంచి రూ.250 చొప్పున రూ.46 లక్షల పెట్టుబడితో మార్టులు ఏర్పాటు చేసి, 1800 రకాల సరుకులు విక్రయానికి అందుబాటులో ఉంచారు. ఈ సరుకులు 10 నుంచి 15 శాతం వరకు రాయితీతో విక్రయిస్తున్నట్టు చెప్పారు. ఇంట్లో నిత్యం వాడే కిరాణా సరుకులు ఐటీసీ, హెచ్‌సీఎల్, పీఅండ్‌జీ, హిందుస్థాన్ వంటి ప్రముఖ కంపెనీల ద్వారా సేకరించడమే కాకుండా స్వయం సహాయక సంఘాల వారు స్వంతంగా తయారు చేసే వస్తువులు, డ్రైఫూట్స్ వంటి సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మార్టులో స్వయం సహాయక సంఘ సభ్యులు నేరుగా అవసరమయిన సరుకులు నిత్యం కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

అడ్డురోడ్డులో...

అడ్డురోడ్డు కేంద్రంగా గురువారం ఉదయం 10.30 గంటలకు మహిళా మార్టు ప్రారంభిస్తున్నట్టు ఏపీఎం శివప్రసాద్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి పాయకరావుపేట సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

మహిళాభివృద్ధికి తోడ్పాటు



మహిళా మార్టు అందుబాటులో తీసుకువచ్చి మహిళలకు నాణ్యమైన కిరణా సరుకులు అందివ్వడం జరుగుతోందన్నారు. మహిళల సహకారంతో ఏర్పాటు చేసిన మార్టులో లాభాలు కూడా షేరు ధనంగా చేరిన మహిళలందరికీ పంచుతూ వారి అభివృద్ధికి తోట్పాటునిస్తుందన్నారు. అధిక లాభాలు ఆశించకుండా చేపట్టిన ఈ మార్టు వ్యాపారం లాభాల దిశగా తీసుకువెళ్లేందుకు వెలుగు అధికార యంత్రాంగం పని చేస్తోందన్నారు. **–సీహెచ్ సత్యవేణి,** ఏరియా కోఆర్డినేటర్, నక్కపల్లి

రాయితీతో నాణ్యమైన వస్తువులు



మహిళామార్టుతో మహిళలకు నాణ్యమైన సరుకులు అందుబాటులో దొరుకుతాయి. మార్టు దగ్గర కొనుగోలుతో పాటు దూర గ్రామాలకు రూ.50 వేలకు పైగా ఆర్డరు ఉంటే డోర్ డెలివరి కూడా చేపడతాం. స్వయం సహాయక సంఘ సభ్యులందరూ ఈ ఆ మార్టు ప్రయోజనలు అందుకునేలా చేస్తాం. గ్రామాల్లో మరుగున ఉండిపోతున్న మహిళలకు పట్టణం తరహాలో మార్టు వ్యాపారాలు చేయించడమే కాకుండా వాటి ద్వారా వచ్చే లాభాలను కూడా వినియోగించుకునేలా మార్టు చాలా ప్రయోజనకరంగా ఉంది. **–మత్తి రూప,** మార్టు అధ్యక్షులు, గోకులపాడు

జిల్లాలో ఇది ఐదో మార్టు...



పాయకరావుపేట నియోజకవర్గంలో అడ్డురోడ్డులో ఏర్పాటు కాబోతున్న మహిళా మార్టు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అనకాపల్లి జిల్లాలో ఇది ఐదో మార్టుగా ప్రారంభం కానుందన్నారు. మహిళా సంఘాలు ద్వారా ఏర్పాటు కాబోతున్న మార్టు నిత్యం అన్ని సరుకులు అందుబాటులో ఉంచేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాం. కమిటీల పర్యవేక్షణలో మార్టు నిర్వహణ జరుగుతోంది. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటఉరట్ల మండలాల వారీగా మహిళా మార్టు అందుబాటులో ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవచ్చు. **–శివప్రసాద్,** ఏపీఎం, ఎస్.రాయవరం మండలం

క్లుప్తంగా

ఎంఎస్ఎంఈ చైర్మన్‌కు అభినందనల వెల్లువ


సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న నాయకులు

కోటవురట్ల: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమల శాఖ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందడంతో సమాచారం తెలుసుకున్నా జిల్లాలోని ముఖ్య నాయకులు తంగేడులోని ఆయన నివాసానికి చేరుకుని అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన నివాసం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తనకు ఇటువంటి గొప్ప అవకాశాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిశ్రమల అభివృద్ధికి, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

నేడు మోదకొండమ్మ ఆలయ శంకుస్థాపన

మునగపాక : మండల కేంద్రంలో గురువారం మోదకొండమ్మ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం 10 గంటల తరువాత ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన జరుగుతుందన్నారు. మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని నూతనంగా నిర్మిస్తున్న ఆలయ శంకుస్థాపనకు భక్తులంతా తరలిరావాలని కోరారు.

ఆదర్శంగా వలంటీర్ల సేవలు


వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక : ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని సిరసపల్లి సచివాలయ ప్రాంగణంలో బుదవారం వలంటీర్లకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు సేవలందించాలన్నారు. తమకు కేటాయించిన కుటుంబాలకు సకాలంలో సేవలందిస్తూ వలంటీర్లు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహిని,వైఎస్సార్ సీపీ నేత బొడ్డేడ జగ్గప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి చేనేత కాలనీలో వినాయక ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో గణపతి హోమం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ, గోపురంపై కలశ స్థాపన, ఆలయం ఎదురుగా ధ్వజస్తంభం ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హోమం, శాంతికల్యాణం, పూర్ణాహుతి అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. ఉపమాక దేవస్థానం అర్చకులు వరప్రసాద్, శేషాచార్యులు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పాయకరావుపేట : పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధునికమైన కంప్యూటర్, లేజర్, ప్రింటర్, తరగతి గదుల్లో టీచర్స్ టేబుల్స్, కుర్చీలు, టీచర్స్‌కు కప్‌బోర్డు, బీరువా తదితర సామాగ్రిని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు ప్రవాసాంధ్రుల కుటుంబ సభ్యులు నోరి నరసింహం, నోరి లక్ష్మీమంగ దంపతులు లక్ష రూపాయిలు, వీరి కుమార్తె నోరి మైథిలి రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. పాఠశాలకు సౌకర్యాలు సమకూర్చడం పట్ల ఉపాధ్యాయులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు. దాతలకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

'మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించే స్థాయి అనితకు లేదు'


మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను విమర్శించే స్థాయి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు లేదని, స్థాయి మరచి విమర్శలు చేయడం ఆమెకు తగదని జెడ్పీటీసీ లంక సూరిబాబు అన్నారు. అడ్డురోడ్డులో జరిగిన సిద్ధం సభలో వంగలపూడి అనితను మంత్రి అమర్‌నాథ్ విమర్శించారన్న అపోహతో మంత్రి అమర్‌నాథ్‌ను ఇష్టానుసారంగా అనిత విమర్శించడంపై పట్టణంలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సూరిబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు ఓటు రూపంలో తగిలికొట్టి అనితను ఓడిస్తారన్నారు. మంత్రి అమర్‌నాథ్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని, ఆయన తాతయ్య ఎమ్మెల్యేగా, తండ్రి మంత్రిగా చేశారని, ప్రస్తుతం అమర్‌నాథ్ మంత్రిగా ఉన్నారన్నారు. అంతేకాని ఏదో విమర్శించాలన్న నెపంతో మంత్రిని విమర్శించడం తగదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అనిత చేసిన భూ అక్రమాలు అందరికీ తెలిసినవే అన్నారు. టీడీపీ పాలనలో అనిత ఎమ్మెల్యేగా వున్నప్పుడు 5 సంవత్సరాలు నియెజకవర్గానికి ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలన్నారు. 14 సంవత్సరాల టీడీపీ పాలనలో రాష్ట్రాన్ని చంద్రబాబు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, ఎంఎల్‌వో కాకాడ కృష్ణ, మాజీ వైస్ సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, నాయకులు వేమగిరి లక్ష్మణరావు, నెలపర్తి నాగరాజు, రావాడ బాబ్జి, బడే కృష్ణ, పార్టీ మహిళా విభాగం సభ్యులు పులి సీతారత్నం, పులుగు రాంబాబు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్యం మరింత చేరువ


ఆరోగ్యసేవల గురించి అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి అవసరమైన సేవలను సంపూర్ణంగా అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. కొక్కిరాపల్లి సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఫేజ్–2 కార్యక్రమాన్ని పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వృద్ధులతో ఆమె మాట్లాడారు. వైద్యం సక్రమంగా అందుతుందా..డాక్టర్లు బాగా చూస్తున్నారా అని అవ్వాతాతలను మహిళలను అడిగారు. సేవలు బాగున్నాయని, ఉచితంగా మందులు, రక్త పరీక్షలు బీపీ , కంటి పరీక్షలు చేయించుకోగలుగుతున్నామని వారు ఆమెకు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం వ్యవసాయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, సంక్షేమం అభివృద్ధితో పాటుగా రాష్ట్రంలో ప్రతి గ్రామం, పట్టణంలో విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లను కోట్లాది రూపాయలతో నిర్మించి అన్ని రకాల వసతులు కల్పించి నాణ్యమైన సేవలు అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు కంటి పరీక్షలు చేయించి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, కౌన్సిలర్ గొర్లె సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె వెంకట్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్న ధ్యేయం


భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి: సంక్షేమం, అభివృద్ధి జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా పనిచేస్తుందన్నారు. అదనపు తరగతి గదులు నిర్మాణం, ఆటస్థలం అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, జడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్‌రాజు, సూర్యనారాయణ, కొవిరి రామకృష్ణ, ఎంఈవో సూర్యారావు, హెచ్‌ఎం వేణుగోపాల్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దళితుల అభివృద్ధి


సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోనే దళితులు అభివృద్ధి చెందుతున్నారని, దళితులకు రాజ్యాధికారం ఇచ్చింది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డే అని జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సీటు (ఎంపీ) ఇవ్వడం దళితుల్ని గుర్తించి అగ్రస్థానంలో కూర్చోబెట్టడమే అన్నారు. పట్టణంలో గల పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరలా వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయవలసిన బాధ్యత అందరిపైన వుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, జేసీఎస్ బి.శ్రీను, మహిళా విభాగం సభ్యులు అడపా శ్రావణి, పులి సీతారత్నం, కొంతం వరలక్ష్మి, పంచాయితీ సభ్యులు పిరాధి రాజు, కొప్పిశెట్టి మోహన్, లావేటి సన్యాసిరావు, వేమగిరి లక్ష్మణరావు, నెలపర్తి నాగరాజు, కాకాడ కృష్ణ, జోన్నాకూడి సూరిబాబు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం : సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి అందించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి అవకతవకలు లేని వ్యవస్థ రాష్ట్రంలో ఉందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వాసు, జువ్వాల నాయుడు, విమలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ పనులపై బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు సామాజిక తనిఖీకి విచ్చేసిన అధికారులతో మాట్లాడారు. అనంతరం పీడీ సందీప్ సామాజిక తనిఖీ తీరుని వివరించారు. విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీలో భాగంగా రూ.3.28 లక్షల నిధులకు సంబంధించిన ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు, రూ.1.38 లక్షలతో చేపట్టిన పంచాయతీరాజ్ పనులు, ఫారెస్ట్ పనులకు సంబంధించి డీఆర్‌సీలు ప్రజా వేదికలో చదివి వినిపించారు.

ఉపాధ్యాయుడు కొట్టారని పోలీసులకు ఫిర్యాదు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు తనను కొట్టారంటూ ఒక బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్టు బుధవారం రాత్రి పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేట హైస్కూల్లో ఆంగ్ల టీచర్‌గా పనిచేస్తున్న సుసర్ల సూర్య ప్రకాశ్ తనను కొట్టారంటూ ఐదో తరగతి చదువుతున్న ఒక బాలిక తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తన కుమార్తెను కొట్టడమేంటని ఆ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం యలమంచిలి గుర జాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను పరిశీలించేందుకు కలెక్టర్, ఎస్పీ, పోలీసు అధికారులు వచ్చారు. అక్కడకు వచ్చిన బాలిక తల్లిదండ్రులు తమ పిల్లను ఉపాధ్యాయుడు కొట్టారని డీఎస్పీ సత్యనారాయణకు చెప్పడంతో దీనిపై పరిశీలన చేయమని స్థానిక పోలీసులను ఆయన ఆదేశించారు. దీంతో ఈ ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. తాను పక్క తరగతిలో విద్యార్థులకు టోఫెల్ క్లాసు వీడియో ద్వారా బోధన చేస్తుండగా పక్క తరగతిలో వున్న పిల్లలు పెద్దగా గోల చేస్తుండడంతో వారిని నిశ్శబ్దంగా ఉండాలని తాను మందలించానని, అంతే తప్ప,కొట్టలేదని టీచర్ సూర్య ప్రకాశ్ సాక్షికి తెలిపారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి


సోషల్ ఆడిట్ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

రాంబిల్లి : ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాంబిల్లిలో బుధవారం సోషల్ ఆడిట్ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అధికారులు రైతులకు ఉపయోగపడే పనులను ఉపాధి హామీ పథకంలో చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భూగర్భ జలాలు వృద్ధి చెందే పనులను చేయాలన్నారు. ఈ పథకం వలసలు లేకుండా సొంత గ్రామాల్లోనే పనులు దొరికేలా చేస్తుందన్నారు. 2022–23 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద రూ 7,43,62,591 ఖర్చు చేశారు. దీనికి సంబంధించి 17 రోజుల పాటు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఈ ప్రజావేదికను నిర్వహించారు. గ్రామాల వారి తనిఖీల నివేదికలను తనిఖీ సిబ్బంది నివేదించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, డ్వామా పీడీ సందీప్, ఎంపీడీవో వెంకటాచలం, ఏపీవో శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైఎస్సార్‌సీపీ నేత ఎన్‌వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పొగాకు రహితంగా తయారు చేద్దాం..



కోటవురట్ల గొల్లపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

కోటవురట్ల: పొగాకు రహిత గ్రామంగా తయారు చేద్దామంటూ విద్యార్థులు నినదించారు. గొల్లపేట ఎంపీపీ స్కూల్ విద్యార్థులు టొబాకో ఫ్రీ జోన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు చైతన్యం కలిగించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాను వివరించి, పొగాకు జోలికి పోమంటూ ప్రతిజ్ఞ చేశారు.

నిరంతరం ఆలోచనలకు పదును పెట్టాలి..


రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో సైన్సు ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీఐ అప్పన్న


దిమిలి ఉన్నత పాఠశాలలో సీవీ రామన్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


గుర్రాజుపేట పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు

కోటవురట్ల : విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టాలని, నిరంతర అన్వేషణతోనే మంచి ఫలితాలు సాధ్యపడతాయని నక్కపల్లి సీఐ గంటా అప్పన్న అన్నారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో బుధవారం సైన్స్ ఫేర్ నిర్వహించి విదార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులకు కితాబునిచ్చారు. సీఐ మాట్లాడుతూ వైజ్ఞానికంగా ప్రతి విద్యార్థి పరిశోధనాత్మక ధోరణిలో ఉండాలన్నారు. హెచ్‌ఎం షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: సైన్స్ పట్ల విద్యార్థులు మరింత మక్కువ పెంచుకోవాలని పీఆర్‌టీయు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ అన్నారు. జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. పెదగుమ్ములూరు పాఠశాలలో సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. పలు ప్రదర్శనలు మ్యాజిక్ ద్వారా విద్యార్థులకు వివరించారు. గుర్రాజుపేట ఉన్నత పాఠశాలలోనూ విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బుర పరచేలా చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, గుర్రాజుపేట ప్రధానోపాధ్యాయుడు కె.కె.ఎల్.ఎస్. ధర్మారావు , పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడువీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలో పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోబెల్ బహుమతి , భారతరత్న గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారతదేశ సత్తాను రామన్ ప్రపంచానికి చాటి చెప్పారని దిమిలి హెచ్‌ఎం జి.ప్రసాదరావు, రాంబిల్లి హెచ్‌ఎం వేణుగోపాల్ అన్నారు. పలువురు విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి వాటిని ప్రదర్శించారు.

మునగపాక : జాతీయ సైన్స్ డే సందర్భంగా తిమ్మరాజుపేట డేవెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో జరిగిన వేడుకల్లో మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌతిక శాస్త్రం, మాథ్స్‌లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ మీనా మిశ్ర మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్, గణితంపై మక్కువ చూపించాలన్నారు. పాఠశాల డీన్ సూరిబాబు, డైరెక్టర్ జెర్రిపోతుల రమణాజీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డుకు మోక్షం

- వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్లు మంజూరు
- నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా పనులు ప్రారంభం


శాశ్వత మరమ్మతులకు నోచుకోనున్న పూడిమడక రోడ్డు

మునగపాక : అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు అచ్యుతాపురంలోని సెజ్ కంపెనీల్లో పనిచేసేందుకు వేలాది మంది ఉపాధి కోసం ఇదే మార్గం మీదుగా బస్సుల్లో ప్రయాణం సాగిస్తుంటారు. ఈ మార్గంలో భారీ వాహనాలు పరిమితికి మించి ప్రయాణించడంతో రహదారి దెబ్బతింది. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి పలు ప్రజా సంఘాలు, పలు పార్టీల నేతలు తీసుకువచ్చారు.అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి మీదుగా అచ్యుతాపురం వరకు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. సాంకేతిక పరమైన ఇబ్బందులను అధిగమించి గురువారం నుంచి రహదారి పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు రహదారి పనులను అనకాపల్లి జాతీయ రహదారి సమీపంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

త్వరితగతిన శాశ్వత మరమ్మతులు



అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టాం. ఈ రోడ్డు నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ ముందుకొచ్చి నిధులు మంజూరు చేసింది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారి మరమ్మతు పనులు శరవేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. **–యు.వి.రమణమూర్తిరాజు,** ఎమ్మెల్యే,యలమంచిలి